సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

సోమవారం । 12 । జూన్ । 2023




పశువుల కంటైనర్ల స్వాధీనం

ఒడిశా నుంచి అక్రమంగా పశువులు తరలిస్తున్న మూడు కంటైనర్లను చింతూరు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. 8లో



చెరకు, యూకలిప్టస్ తోట దగ్ధం

దేవరాపల్లి మండలంలోని వాకపల్లిలో సుమారు 5 ఎకరాల్లోని చెరకు కార్శి తోట, యూకలిప్టస్ తోట దగ్ధమైంది. 8లో



ప్రకృతి గీసిన 'చిత్రం'

అనంతగిరి మండలం టోకూరు రోడ్డులో పచ్చని అందాల నడుమ ప్రయాణం ఆహ్లాదనిస్తోంది. అప్పుడే మొలకెత్తిన రాగుల పైరు ఆకుపచ్చని తివాచీని తలపిస్తోంది.

న్యూస్‌రీల్

17 వరకు ఒంటిపూట బడులు

- కలెక్టర్ సుమిత్‌కుమార్



సాక్షి, పాడేరు: వేసవి సెలవులు అనంతరం పాఠశాలల ఈనెల 12 నుంచి (సోమవారం) పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో ఈనెల 17 వతేదీ వరకు ఒంటి పూట పనిచే స్తాయని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7.30 నుంచి 11.30 వరకు పాఠశాలలు పనిచేస్తాయని ఈ మేరకు విద్యాశాఖ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారని ఆయన పేర్కొన్నారు. ఎండతీవ్రత అధికంగా ఉండడంతో ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లుగా ఆయన తెలిపారు. ఈ19వ తేదీనుంచి నుంచి పాఠశాలలు యథావిధిగా సాగుతున్నాయని ఆయన పేర్కొన్నారు.

మానసిక రోగులకు వైద్య శిబిరాలు రేపు

రాజవొమ్మంగి: మానసిక రోగుల కోసం జిల్లాలోని మూడు పీహెచ్‌సీలలో మంగళ వారం ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్టు మానసిక వైద్య నిపుణులు డాక్టర్ రామారెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా గంగవరం పీహెచ్‌సీలో ఉదయం 9 నుంచి 10.30గంటల వరకు, ఎల్లవరంలో 11 నుంచి 1.30గంట వరకు, రాజవొమ్మంగి పీహెచ్‌సీలో మధ్యాహ్నం 2 నుంచి 4గంటల వరకు శిబిరాలు ఏర్పాటుచేసినట్టు పేర్కొన్నారు.అవసరమైన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

లాటరీ పేరిట మోసంపై ఫిర్యాదు



సీఐ రమేష్, ఎస్‌ఐ రమణకు ఫిర్యాదు చేస్తున్న బాధితులు

చింతపల్లి: లాటరీ పేరుతో మోసపోయిన తమకు న్యాయం చేయాలని కోరుతూ తురుతుంపాడు, పిసిరిమామిడికి చెందిన కొంతమంది గిరిజనులు ఆదివారం అన్నవరంలో పోలీసులకు ఫిర్యాదు చేశారు. శ్రీ లక్ష్మీ నర్సింహ ఎంటర్‌ప్రైజెస్ లక్కీడ్రా పేరిట మైదాన ప్రాంతాలకు చెందిన ఇద్దరు వ్యక్తులు గిరిజనులు ఒకొక్కరి నుంచి రూ.5 వేల నుంచి రూ.10 వేలు వసూలు చేశారు. విలువైన వస్తువులు తక్కువ ధరకే ఇస్తామని నమ్మబలకడంతో గిరిజనులు ఆశపడి చెల్లించారు. ఈ నేపథ్యంలో వారు కనిపించకపోవడంతో మోసపోయామని భావించిన బాధితులు న్యాయం చేయాలని పోలీసులను ఆశ్రయించారు. పూర్తి స్థాయి విచారణ చేపట్టి నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ రమేష్ తెలిపారు.

పలు రైళ్లు రద్దు



తాటిచెట్లపాలెం: ఇటీవల ఒడిశాలో కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ ప్రమాద దృష్ట్యా బహనగర బజార్ స్టేషన్ వద్ద నిర్వహిస్తున్న ట్రాక్ నిర్వహణ పనుల నిమిత్తం ఆయా స్టేషన్‌ల్లో బయల్దేరాల్సిన పలు రైళ్లు రద్దయినట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. ఈనెల 13వ తేదీన షాలిమార్–విశాఖపట్నం(22853) సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, సంత్రగచ్చి–చెన్నై సెంట్రల్ (22807) ఎక్స్‌ప్రెస్, హౌరా–విశ్వేశ్వరయ్య టెర్మినల్ బెంగళూరు(22887) సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, షాలిమార్–చెన్నై (22825) ఎక్స్‌ప్రెస్, షాలిమార్–హైదరాబాద్(18045) ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్–షాలిమార్ (12774) ఎక్స్‌ప్రెస్, హైదరాబాద్–షాలిమార్ (18046) ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్, విల్లుపురం –ఖరగ్‌పూర్(22604) ఎక్స్‌ప్రెస్, ఎర్నాకుళం –హౌరా (22878) సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రద్దు చేశారు.

రేపు మినీ జాబ్ మేళా

కంచరపాలెం: ఊర్వశి కూడలిలోని గౌరీ డిగ్రీ–పీజీ కళాశాలలో ఈ నెల 13న మినీ జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి సాయికృష్ణ చైతన్య ఓ ప్రకటనలో తెలిపారు. మిరాకిల్ సాఫ్ట్‌వేర్ సిస్టమ్స్, డాక్టర్ రెడ్డీస్ సంస్థలు మంగళవారం ఉదయం 9 గంటలకు 110 పోస్టుల భర్తీ కోసం ఇంటర్వ్యూలు నిర్వహిస్తాయన్నారు. విశాఖతో పాటు ఉత్తరాంధ్ర జిల్లాల్లో అర్హులైన నిరుద్యోగులు దరఖాస్తు చేసుకోవచ్చని, డిగ్రీ, డిప్లమో పూర్తి చేసి 19 నుంచి 24 ఏళ్ల మధ్య వయసు కలిగిన వారు అర్హులన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు https://www.apssdc.in లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 98484 38254ను సంప్రదించాలని సూచించారు.

పరిశోధనలు ఫలవంతం

జిల్లాలోని జీడిమామిడి రైతులకు మంచి రోజులు రానున్నాయి. ఇప్పటివరకు పిక్క ద్వారా మాత్రమే ఆదాయం పొందుతున్నారు. వృథాగా వదిలేస్తున్న జీడిమామిడి పండ్లను కూడా ఆదాయ వనరుగా మార్చుకోవచ్చని పందిరి మామిడి ఉద్యానవన పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. ఇక్కడ నిర్వహించిన పరిశోధనల్లో మంచి ఫలితాలు రావడంతో విలువ ఆధార ఉత్పత్తుల తయారీ లైసెన్సుకు దరఖాస్తు చేశారు. యూనిట్ల ఏర్పాటుకు నాబార్డు సహకారం కోరారు.

- జీడిమామిడి నుంచి విలువాధార ఉత్పత్తులు
- గిరిజనులకు అదనపు ఆదాయం
- లైసెన్సు దరఖాస్తు చేసిన పందిరిమామిడి పరిశోధన స్థానం
- యూనిట్ల ఏర్పాటుకు నాబార్డు సహకారం



జీడిమామిడి పండ్లు

రంపచోడవరం: ఏజెన్సీలో గిరిజనుల ప్రధాన ఆదాయ వనరు జీడిమామిడి తోటలు. పోడు భూములతోపాటు వ్యవసాయ భూముల్లోను జీడిమామిడిని సాగు చేస్తున్నారు. అయితే జీడిమామిడి గింజలను మాత్రమే సేకరించి పండును వదిలేస్తున్నారు. ఇది కూడా విలువ ఆధారిత ఉత్పత్తులను తయారు చేసి ఆదాయన వనరుగా మార్చుకోవచ్చని పందిరిమామిడి డాక్టర్ వైఎస్సార్ ఉద్యానవన పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు. చాలా రాష్ట్రాల్లో జీడిమామిడి పండ్లతో విలువ ఆధారిత పదార్థాలను తయారు చేస్తూ జీడిపిక్కల కంటే ఎక్కువ ఆదాయం పొందుతున్నారని వారు తెలిపారు.

అధిక విస్తీర్ణంలో సాగు..

జిల్లాలోని 24 మండలాల్లో 58,397 ఎకరాల్లో జీడిమామిడిని సాగు చేస్తున్నారు. ముంచంగిపుట్టు, అనంతగిరి, కొయ్యూరు, దేవీపట్నం, వై.రామవరం, గంగవరం, రంపచోడవరం, అడ్డతీగల, రాజవొమ్మంగి మండలాల రైతులకు తోట పంటల్లో జీడిమామిడి ప్రధాన ఆదాయ వనరు. సీజన్‌లో రైతులు పిక్కను మాత్రమే సేకరించి జీడిపండ్ల ప్రయోజనాలను గుర్తించలేదు. దీంతో ఆదాయాన్ని చేజార్చుకుంటున్నారు.

సమృద్ధిగా పోషక విలువలు

జీడిమామిడి పండులో నారింజ కంటే 'సి' విటమిన్ ఆరు రెట్లు ఎక్కువ. దీంతోపాటు చక్కెర, టానిన్, ఖనిజ లవణాలు, పాస్పరస్, కాల్షియం, ఇనుము ఉన్నాయని శాస్త్రవేత్తలు తెలిపారు. తేమ శాతం 84, మాంసకృత్తులు 0.15, కొవ్వు పదార్థాలు 0.5శాతం, పీచు పదార్థాలు 0.5 నుంచి 1 శాతం ఉన్నాయి. జీడిమామిడి పండును నేరుగా తినడం వల్ల ఫినాలిక్స్ అనే రసాయనం వల్ల గొంతులో కీచు ఏర్పడుతుంది. చక్కెరతో కలిపి తీసుకుంటే దాని ప్రభావం ఉండదు. జీడిమామిడి పండ్లను సేకరించిన మూడు గంటల్లోనే శుద్ధి చేసి ఆహార పదార్థాలుగా మార్చడం వల్ల పోషక విలువలకు ఎటువంటి నష్టం ఉండదు.

పరిశోధనల్లో మంచి ఫలితాలు

ఏజెన్సీలో టన్నుల కొద్దీ లభ్యమయ్యే జీడిమామిడి పండ్లను ఉపయోగంలోకి తెచ్చేందుకు ఇటీవల పందిరిమామిడి హార్టికల్చర్ యూనివర్సిటీ ఉద్యాన పరిశోధన స్థానం వారు వివిధ ప్రయోగాలు నిర్వహించారు. పండ్లతో జామ్, స్క్వాష్ జెల్లీ, క్యాండీ, ఊరగాయ, చట్నీలు తయారు చేయవచ్చని నిర్ధారించారు. పండ్ల నుంచి తీసిన రసానికి జెలిటిన్ లేదా స్టార్చ్ కలిపి మస్లెస్ క్లాత్‌తో వడపోయాలి. లీటరు రసానికి పావు కిలో చక్కెర కలిపి వేడి చేసి చల్లార్చాలి. దీనికి ఒకశాతం బెంజెయేట్ రసాయనాన్ని కలిపి స్టెరిలైజ్ బాటిళ్లలో నింపి గాలి చొరబడకుండా మూత పెట్టాలి. దీనికి 2శాతం సిట్రిక్ యాసిడ్, 0.1 శాతం సోడియం బెంజెయేట్‌ను జోడిస్తే రసం నిల్వ ఉంటుందని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు.

జీడిపండుతో మంచి ఆదాయం



ల్యాబ్‌లో మైక్రో ఫిల్టర్ ద్వారా జీడిమామిడి పండ్ల రసాన్ని వడపోశాం. దీని వల్ల రసంలోని వగరు తగ్గింది. విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీకి డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీకి యూనివర్సిటీ ద్వారా అనుమతుల కోసం దరఖాస్తు చేశాం. ఏజెన్సీలో గిరి రైతుల ఆర్థికాభివృద్ధి లక్ష్యంగా యూనిట్ల ఏర్పాటుకు నాబార్డు సహకారం కోరాం. ఇవన్నీ కార్యరూపం దాల్చితే వృథాగా వదిలేస్తున్న జీడిమామిడి పండ్లు కూడా మంచి ఆదాయ వనరుగా మారే అవకాశం ఉంది.

– పీసీ వెంగయ్య, సీనియర్ శాస్త్రవేత్త, ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, డా. వైఎస్సార్ ఉద్యానవన పరిశోధన స్థానం, పందిరిమామిడి

ముత్యాలమ్మ తల్లికి జలాభిషేకం



నిండుబిందెలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

వీఆర్‌పురం: తమ గ్రామానికి ఎలాంటి ఆపద కలగకుండా తమ కుటుంబాలను ఎల్లప్పుడు చల్లంగా చూడాలని మండలంలోని రేఖపల్లిలో ముత్యాలమ్మ అమ్మవారిని ఆదివారం గ్రామస్తులు వేడుకున్నారు. దీనిలో భాగంగా ఆదివారం అమ్మవారికి జలాభిషేకం నిర్వహించారు. ఈ ఏడాది గ్రామంలో ఎక్కువ మశూచి వ్యాధి బారిన పడ్డారు. దీంతో అమ్మవారు శాంతించాలని చల్లబోనం కార్యక్రమాన్ని కొండ్రాజుల కొలుపుల కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఈ నెల తొమ్మిదవ తేదీన తలపెట్టారు. దీనిలో భాగంగా మూడు రోజుల పాటు గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. చల్ల (మజ్జిగ,గంజి)ను సేకరించి గ్రామశివారులో సంతపాకల వద్ద కొలువుదీరిన ముత్యాలమ్మ, వనం పోతురాజులకు నైవేద్యంగా సమర్పించారు.అనంతరం గ్రామంలోని మహిళలు 101 నిండుకుండలతో ఊరేగింపు చేపట్టారు. అమ్మవారు శాంతించాలని కోరుతూ అనంతరం జలాభిషేకం నిర్వహించారు. గ్రామ పొలిమేరలో ముడుపులు కట్టారు.

థ్యాంక్యూ సీఎం సార్

- వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చిత్రపటానికి కాంట్రాక్ట్ లెక్చరర్ల క్షీరాభిషేకం
- డిప్యూటీ సీఎం బూడి సమక్షంలో హర్షాతిరేఖాలు



ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న కాంట్రాక్ట్ లెక్చరర్లు

దేవరాపల్లి: ప్రభుత్వ కళాశాలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ లెక్చరర్లను రెగ్యులర్ చేస్తూ మంత్రివర్గ సమావేశంలో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించినందుకు కాంట్రాక్ట్ లెక్చరర్లు హర్షాతిరేఖాలు వ్యక్తం చేశారు. తారువలోని డిప్యూటీ సీఎం క్యాంప్ కార్యాలయంలో మంత్రి బూడి ముత్యాలనాయుడు సమక్షంలో సీఎం జగన్‌మోహన్ రెడ్డి చిత్రపటానికి ఆదివారం క్షీరాభిషేకం చేశారు. రెగ్యులర్ చేసిన సీఎం జగన్‌తో పాటు సహకరించిన డిప్యూటీ సీఎం బూడికి కృతజ్ఞతలు తెలియజేశారు. డిప్యూటీ సీఎంను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కాంట్రాక్ట్ లెక్చరర్ల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బి.ఎస్.ఆర్. శర్మ మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం రెగ్యులర్ చేసిన సీఎంకు తామంతా జీవితాంతం రుణపడి ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్ట్ లెక్చరర్ల అసోసియేషన్ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు రాజేష్, కార్యదర్శి అప్పారావు, గొంద్రుపోటు పార్థసారథి, రామకోటి, కోటేశ్వరరావు, లక్ష్మణరావు, రమణ, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నూకాంబిక అమ్మవారికి 158 ఘటాలతో ఊరేగింపు



ఘటాలతో ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు

అనకాపల్లిటౌన్: స్థానిక నెయ్యిలవీధి ప్రజలు 158 ఘటాలతో నూకాంబిక అమ్మవారి ఉత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. శనివారం రాత్రి ప్రతీ ఇంటివద్ద అమ్మవారి పాటను ఏర్పాటు చేసుకుని ఆదివారం ఉదయం 8 గంటలకు నెయ్యిలవీధిలో వన్‌వే నుంచి ఘటాలను ఊరేగిస్తూ గవరపాలెం నూకాంబిక అమ్మవారి ఆలయానికి చేరుకుని సమర్పించారు. గ్రామ ప్రజలు ఆరోగ్యం, సుఖసంతోషాలతో జీవించాలని కోరుకుంటూ నెయ్యిలవీధి ప్రజలు ఏటా అమ్మవారి పండగను నిర్వహించడం ఆనవాయితీ.

'ఆణిముత్యాలు'కు ప్రోత్సాహం

- టెన్త్ టాపర్‌లకు నగదు పురస్కారం
- ప్రతీ ప్రభుత్వ పాఠశాలలో ముగ్గురికి నగదు అందజేత
- నేటి నుంచి 19 వరకు పాఠశాలల్లో ప్రత్యేక కార్యక్రమాలు



నగదు బహుమతి అందుకోనున్న కేజీబీవీ విద్యార్థులు

విశాఖ విద్య: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు అన్నిరకాలుగా తోడ్పాటు అదిస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వం, వారిలో మరింత పోటీతత్వాన్ని పెంచేలా బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇటీవల విడుదలైన పదో తరగతి ఫలితాల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను 'జగనన్న ఆణిముత్యాలు'గా ప్రకటించి వారికి నగదు పురస్కారాలను అందజేయనున్నట్లు ప్రకటించింది. నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిలో టాప్‌లో నిలిచిన విద్యార్థులతో పాటు, ప్రతీ పాఠశాలలో మొదటి మూడు స్థానాలు దక్కించుకున్న విద్యార్థులకు సైతం నగదు పురస్కారాలు అందజేయనుంది. సోమవారం నుంచి ఈ నెల 19 వరకు ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలోని హైస్కూళ్లలో వేడుకలు నిర్వహించేందుకు జిల్లా విద్యాశాఖాధికారులు కార్యాచరణ సిద్ధం చేశారు. అలాగే ఈ నెల 15న నియోజకవర్గ స్థాయి, 17న జిల్లా స్థాయి, 20 రాష్ట్ర స్థాయిలో వేడుక నిర్వహించనున్నారు. పాఠశాల స్థాయిలో నగదు అందుకున్న విద్యార్థులు నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిలో కూడా ప్రతిభ చూపినట్లయితే వారికి అదనపు నగదు పురస్కారం దక్కనుంది.

జిల్లాలో 108 మందికి నగదు పురస్కారం

జిల్లాలో ప్రభుత్వ యాజమాన్య పరిధిలో ఏపీఆర్ఎస్ –1, ప్రభుత్వ–6, కేజీబీవీ–3, ఏపీటీడబ్ల్యూఆర్–2, జెడ్పీ–9, బీసీ వెల్ఫేర్ –3, ఎయిడెడ్–10, మున్సిపల్–21, సోషల్ వెల్ఫేర్ పరిధిలోని 3 పాఠశాలల నుంచి ఈ ఏడాది 10,747 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరయ్యారు. వీరిలో 7,198 మంది విద్యార్థులు పాసయ్యారు. 62 శాతం ఉత్తీర్ణత నమోదైంది. 4,632 మంది ఫస్ట్‌క్లాస్ మార్కులతో ఉత్తీర్ణత పొందారు. ప్రభుత్వ పాఠశాలల నుంచి ఏకంగా 921 మంది 500లకు పైగా మార్కులు సాధించారు. ఇలాంటి వారిని ప్రోత్సహించాలనే తలంపుతోనే ప్రభుత్వం ప్రతీ పాఠశాలలో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన వారికి నగదు పురస్కారం ఇవ్వాలని ఆదేశించింది.

జిల్లాలో 108 మందికి నగదు పురస్కారం పంపిణీ కోసమని రూ.6.48 లక్షలు మంజూరయ్యాయి. సమగ్రశిక్ష అధికారులు ఈ డబ్బులను నేరుగా పాఠశాలల హెచ్‌ఎం, పేరెంట్స్ కమిటీ పేరుతో ఉన్న బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్నారు. విద్యార్థులను పాఠశాలలకు పిలిపించి ప్రజాప్రతినిధులు, గ్రామస్తుల సమక్షంలో సత్కరించి నగదు పురస్కారం అందించాలని డీఈవో ఎల్.చంద్రకళ ఆదేశించారు. ఈ విషయంలో పాఠశాలల హెచ్‌ఎంలు శ్రద్ధ తీసుకోవాలన్నారు.

అడ్డాకులతో ఆర్థిక ఆసరా

- వారపు సంతల్లో ఆశాజనకంగా ధర
- గిరి రైతుల్లో ఆనందం



అడ్డాకుల లోడింగ్

జి.మాడుగుల: జిల్లాలోని అటవీ ప్రాంతాల్లో విరివిగా లభిస్తున్న అడ్డాకుల అమ్మకాలతో గిరిజనులు ఆర్థిక ఆసరా పొందుతున్నారు. ఏజెన్సీలో గిరిజనులు వేకువజామున నిద్రలేచి అడ్డాకుల సేకరణకు అడవులకు వెళుతుంటారు. వారు ఎక్కువగా అటవీ వ్యవసాయ ఉత్పత్తులపైనే జీవనం సాగిస్తున్నారు. అడవుల నుంచి సేకరించే అటవీ ఉత్పత్తుల్లో అడ్డాకులే ఎక్కువగా ఉంటాయి. గిరిజన ప్రాంత అడవుల్లో దొరికే అడ్డాకులు నాణ్యతగా ఉంటాయి.

అటవీ ప్రాంతాల్లో అడ్డచెట్ల నుంచి అడ్డాకులు, అడ్డనార, అడ్డపిక్కలను సేకరించి వాటిని ఇంటికి తీసుకొచ్చి ఎండలో ఆరబెట్టి ఆకులు కట్టలుగాను, అడ్డనారతో తాడుల తయారీ, అలాగే అడ్డపిక్కల ద్వారా ఆదాయం పొందుతున్నారు.

- అడ్డాకుల కట్టలు మహిళలు తలపైన, మగవారు కావిడితోనూ వారపు సంతలకు తీసుకువచ్చి విక్రయిస్తుంటారు.
- అడ్డతాడు, అడ్డాకుల ధరలు ఆశాజనకంగా ఉన్నాయి. వారపు సంతల్లో 30 నుంచి 50 కిలోల ఆకులకు రూ.300 నుంచి 500 వరకు ధర ఉంది. మగవారు కావిడితో తీసుకువచ్చే రెండు దిండ్లు కలిపి రూ. రెండు వేల నుంచి రూ. 2, 200 వరకు ధర పలకడంతో గిరిజనుల్లో ఆనందం నెలకొంది.
- జిల్లాలోని జి.మాడుగుల,చింతపల్లి, గూడెం కొత్తవీధి, కొయ్యూరు, పాడేరు, హుకుంపేట, ముంచంగిపుట్టు, డుంబ్రిగుడ, అరకులోయ, పెదబయలు మండలాల్లోని వారపు సంతల్లో అడ్డాకుల విక్రయాల సందడి నెలకొంది.
- గిరిజన ప్రాంతాల్లో అడ్డాకులు కొనుగోలు చేసి లారీలు, వ్యాన్లు, తదితర వాహనాల్లో వ్యాపారులు మైదాన ప్రాంతాలకు తరలిస్తున్నారు.

డిమాండ్ పెరిగింది

గ్రామాల్లో రానురాను ప్లాస్టిక్ వినియోగం తగ్గుతుండటంతో అడ్డాకులకు డిమాండ్ ఏర్పడటంతో ధర పెరిగింది. ఎంతో శ్రమించి వారపు సంతకు తీసుకువచ్చి విక్రయిస్తుంటాం. అందుకు తగ్గట్టుగా ధర బాగున్నందున ఆదాయం వస్తోంది.

– రాజుబాబు, గడుతూరు గ్రామం

బొర్రా గుహలకు పర్యాటకుల తాకిడి



బొర్రా గుహలను తిలకిస్తున్న పర్యాటకులు



ఎండతీవ్రతతో గొడుగులు వేసుకుని వెళుతున్న పర్యాటకులు

మూడు రోజులుగా భారీ ఆదాయం

అనంతగిరి: మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన బొర్రాగుహలకు పర్యాటకులు పోటెత్తారు. వేసవి సెలవులు ముగియనుండటంతో పర్యాటకులు పెద్ద ఎత్తున కుటుంబ సభ్యులతో తరలివచ్చి బొర్రాగుహలను అందాలను తిలకించారు. ఆదివారం 2,600 మంది, శనివారం 2,100 మంది, శుక్రవారం 1,700 మంది బొర్రా గుహలను తిలకించారు. మూడు రోజుల్లో సుమారు రూ.5 లక్షల మేర ఆదాయం పర్యాటక శాఖకు వచ్చింది.

ఎండ తీవ్రతకు ఇబ్బందులు

ఎండతీవ్రతకు పర్యాటకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఉదయం ఏడు గంటల వరకు చల్లగా ఉండగా, 8 దాటిన తరువాత ఎండతీవ్రత అధికమైంది. పర్యాటకులు గొడుగులను వేసుకునివచ్చి మరి బొర్రాగుహలను అందాలను తిలకించారు. బొర్రా గుహలను తిలకించేందుకు వచ్చిన వృద్ధులు, చిన్నారులు చెట్ల నీడలో సేదతీరారు. సాయింత్రం మూడు గంటల తరువాత ఎండతీవ్రత తగ్గడంతో పర్యాటకులు ఉపశమనం పొందారు.

ఐస్ ఫ్యాక్టరీలకు వడదెబ్బ!

- ఉష్ణతీవ్రతతో తయారీకి జాప్యం
- టన్ను రూ.1,400 నుంచి 1,900కి పెంపు
- ఐస్ కొరతతో మత్స్యకారుల తీవ్ర ఇక్కట్లు



ఫిషింగ్ హార్బర్‌లోకి బోట్లలోకి ఐస్ లోడింగ్ చేస్తున్న మత్స్యకారులు

సాక్షి, విశాఖపట్నం: వేసవి తీవ్రత ప్రభావం ఐస్ తయారీపై పడింది. ఉష్ణోగ్రతల పెరుగుదలతో ఐస్ తయారీ ఆలస్యమవుతోంది. ఇది ఆయా తయారీ సంస్థలకు భారమవుతోంది. ఉత్పత్తి తగ్గడంతో కొరతకు దారితీస్తోంది. మరో మూడు రోజుల్లో చేపలవేటపై ఉన్న నిషేధం ముగుస్తుంది. 15వ తేదీ నుంచి వేట ప్రారంభమవుతుంది. వారం, పది రోజుల ముందు నుంచే బోటు యజమానులు ఐస్‌ను సిద్ధం చేసుకుంటారు. విశాఖ ఫిషింగ్ హార్బర్‌లో 700కు పైగా మరపడవలు చేపలవేట సాగిస్తుంటాయి. వీటిలో 15 నుంచి 600 బోట్ల వరకు వేటకు సన్నద్ధమవుతున్నాయి. ఈ హార్బర్‌లో ఎనిమిది ఐస్ ఫ్యాక్టరీలున్నాయి. తగినంత ఉత్పత్తి జరగక ఇవి బోట్ల అవసరమైన మేర ఐస్‌ను సరఫరా చేయలేకపోతున్నాయి. ఒకసారి వేటకు వెళ్లడానికి బోటుకు 15 టన్నుల ఐస్ అవసరమవుతుంది. కానీ ప్రస్తుతం సగం ఐస్ కూడా లభ్యత ఉండడం లేదు. దీంతో 15వ తేదీ నుంచి తమ బోట్లను పూర్తి స్థాయిలో వేటకు సిద్ధం చేసుకోలేని పరిస్థితుల్లో ఉన్నామని మత్స్యకారులు చెబుతున్నారు. ఇప్పటికే ఈనెల 7 నుంచి వీరు ఐస్‌ను కొనుగోలు చేసుకుని భద్రపరచుకుంటున్నారు.

సమ్మర్ ఎఫెక్ట్ ఇలా..

ఐస్ తయారీకి అవసరమైన నీటి ఉష్ణోగ్రత 21–22 డిగ్రీల మధ్య ఉండాలి. అలా ఉంటే ఐస్ పూర్తి స్థాయిలో తయారవడానికి 40 గంటల సమయం పడుతుంది. అయితే పక్షం రోజులుగా వీస్తున్న వడగాడ్పులతో అది 35 డిగ్రీల వరకు చేరుకుంటోంది. దీంతో లోపల యంత్రాలకున్న కూలింగ్ తగ్గిపోతుండడం వల్ల ఇప్పుడా సమయం 50–55 గంటలు తీసుకుంటోంది. దీనికి విద్యుత్‌తో పాటు లేబర్, ఇతరత్రా వినియోగం అధికమవుతోంది. అలాగే ఐస్ తయారీలో వినియోగించే అమ్మోనియా, ఉప్పు ధర కూడా పెరిగింది. ఇది ఐస్ ఉత్పత్తికయ్యే ఖర్చును పెంచుతోంది. ఈ నేపథ్యంలో ఐస్ తయారీ సంస్థల యజమానులు ఐస్ రేటును పెంచారు. ఇప్పటివరకు టన్ను ఐస్ ధర రూ.1,400 ఉండగా తాజాగా దానిని రూ.1,900కి పెంపుదల చేశారు. ప్రస్తుతం 60 శాతం ఉత్పత్తికి మించడం కష్టమవుతోందని, దీంతో డిమాండ్ మేరకు ఐస్ సరఫరా చేయలేకపోతున్నామని ఫిషింగ్ హార్బర్‌లోని ఓ ఐస్ ఫ్యాక్టరీ యజమాని కర్ణ నాగిరెడ్డి 'సాక్షి'కి చెప్పారు.

రాయితీ కోసం వినతి

మరోవైపు ఐస్ టన్నుకు రూ.500 పెరగడం తమకు ఆర్థికంగా భారంగా మారిందని బోటు యజమానులు అంటున్నారు. ఒక బోటు నెలకు రెండు సార్లు వేటకెళ్తే సగటున 25 టన్నుల ఐస్ అవసరమవుతుందని, ఈ లెక్కన ఒక్క ఐస్‌కే రూ.12 వేల వరకు వెచ్చించాల్సి వస్తుందని చెబుతున్నారు. ఇప్పటికే చేపలవేట గిట్టుబాటు కాని పరిస్థితుల్లో ఐస్ ధర పెరగడం మరింత భారమవుతుందని వీరు ఆవేదన చెందుతున్నారు. పూర్తి స్థాయిలో ఐస్‌ను సమకూర్చుకున్న బోట్లు 15 నుంచి వేటకు బయలుదేరతాయని, లేని బోట్లు ఈనెల 20వ తేదీ వరకు వేచి ఉండాల్సిన పరిస్థితి ఉంటుందని పేర్కొంటున్నారు. పెరిగిన ఐస్ భారం బోటు యజమానులపై పడకుండా టన్నుకు రూ.వెయ్యి రాయితీ ఇప్పించాలని ప్రభుత్వానికి విన్నవించనున్నట్టు రాష్ట్ర మరపడవల సంఘం అధ్యక్షుడు వాసుపల్లి జానకీరామ్ 'సాక్షి'కి చెప్పారు.

క్లుప్తంగా

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత



పూజలు చేస్తున్న అరకు ఎంపీ మాధవి, శివప్రసాద్ దంపతులు, ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

కొయ్యూరు: మండలంలోని బాలారం గ్రామంలో ఇటీవల నిర్మించిన బంగారమ్మ తల్లి ఆలయాన్ని అరకు ఎంపీ గొడ్డేటి మాధవి, శివప్రసాద్ దంపతులు, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు వారికి సంప్రదాయంగా స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత చేకూరుతుందన్నారు. ఎంపీపీ బడుగు రమేష్, జెడ్పీటీసీ సభ్యుడు వారా నూకరాజు, పార్టీ మండల అధ్యక్షుడు జల్లి బాబులు, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ గాడి నాగమణి, ట్రైకార్ డైరెక్టర్ సుమర్ల సరస్వతి, మండల కన్వీనర్ సుధాకర్, నాయకులు గాడి సత్యనారాయణ, శేఖర్, బుజ్జి, తిరుపతి పాల్గొన్నారు.

108లో ప్రసవం



శిశువును బంధువులకు అప్పగిస్తున్న సిబ్బంది

అడ్డతీగల: ఆపదలో అపర సంజీవినిగా నిలుస్తున్న 108 వాహనం మరోసారి ఆ పేరు నిలబెట్టుకుంది. మారుమూల ప్రాంతం దుశ్చర్తికి చెందిన కలిదిండి శాంతికుమారి అనే మహిళకు పురిటి నొప్పులు ఎక్కువై ఇబ్బంది పడుతున్నట్టు కుటుంబసభ్యులు 108కు శనివారం అర్ధరాత్రి సమాచారం ఇచ్చారు. వాహన సిబ్బంది వెంటనే ఆ గ్రామానికి వెళ్లి గర్భిణి శాంతికుమారిని తీసుకుని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలో డి.కొత్తూరు వచ్చేసరికి నొప్పులు ఎక్కువ ప్రసవమైంది. పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. సపర్యలు చేసిన అనంతరం తల్లి, బిడ్డలను అడ్డతీగల సీహెచ్‌సీలో చేర్పించారు. 108 వాహన సిబ్బంది ఈఎంటీ అమ్మినాయుడు, పైలెట్ నవాజ్ సేవలందించారు.

వృత్యంతర శిక్షణ విజయవంతం



ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న డైట్ ప్రిన్సిపాల్ మాణిక్యంనాయుడు(ఫైల్)



బోధనాభ్యసన సామగ్రిని ప్రదర్శిస్తున్న ఉపాధ్యాయులు

- నెరవేరిన ప్రభుత్వ లక్ష్యం
- 2008, 1998 ఎంటీఎస్ ఉపాధ్యాయులకు 5 వారాల శిక్షణ
- విద్యార్థులకు మరింత సులభతర, ఆసక్తికర బోధనకు దోహదం

అచ్యుతాపురం(అనకాపల్లి): నాణ్యమైన బోధన, సులభతర అభ్యసనం దిశగా ప్రభుత్వ లక్ష్యం నెరవేరనుంది. 1998, 2008 డీఎస్సీల్లో నష్టపోయిన ఉపాధ్యాయులకు ఎంటీఎస్ ఉద్యోగాలు ఇచ్చేటపుడు సీఎం జగన్ చేసిన దిశా నిర్దేశానికి అనుగుణంగా విశాఖ డైట్ సిబ్బంది వృత్యంతర శిక్షణను అందించింది. మండు వేసవిలోనూ నూతన ఉపాధ్యాయులు(ఎంటీఎస్) ఈ శిక్షణను ఆస్వాదించారు. ఉమ్మడి జిల్లాలో నియమితులైన 2008, 1998 డీఎస్సీ ఉపాధ్యాయులతోపాటు 2018 డీఎస్సీ 2023–24 విద్యా సంవత్సరంలో విద్యార్థులకు మెరుగైన బోధన అందించేందుకు ఈ శిక్షణ ఎంతగానో దోహదపడిందని చెప్తున్నారు.

ఎఫ్ఎల్ఎస్, నిపుణ్ భారత్‌పై అవగాహన

ఉమ్మడి విశాఖ జిల్లాలో 600 మంది ఎంటీఎస్ ఉపాధ్యాయులకు తోడు 2018 డీఎస్సీ ఉపాధ్యాయులకు వృత్యంతర శిక్షణ ఇచ్చారు. దీనికి డైట్ ప్రిన్సిపాల్ నేతృత్వంలో 40 మందికి పైగా రిసోర్స్‌పర్సన్స్ ఐదు వారాల పాటు శ్రమించారు. పెందుర్తిలో రెండు విడతలు, అనకాపల్లిలో రెండు విడతలుగా ఈ శిక్షణ జరిగింది. 2016 తర్వాత జరిగిన వృత్యంతర శిక్షణ కావడంతో ఈ ఇండక్షన్ ట్రైనింగ్‌కు ప్రాధాన్యత ఏర్పడింది.

కొత్తగా అమలు చేయాలని భావిస్తున్న ఎఫ్ఎల్ఎస్(ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ), నిపుణ్ భారత్, నూతన విద్యా విధానం(ఎన్ఈపీ), విద్యా హక్కు చట్టం(ఆర్టీఈ) వంటి అంశాలపై ఉపాధ్యాయులకు మార్గనిర్దేశం చేశారు.

విద్యార్థులే కేంద్రంగా బోధన

ఈ శిక్షణలో విద్యార్థులే కేంద్రంగా బోధన జరగాలని, దానికి తీసుకోవాల్సిన చర్యలపై కూలంకషంగా వివరించారు. ముఖ్యంగా తరగతి గదిలో విద్యార్థిని సంసిద్ధం చేయడం, అక్షరాలు నేర్చుకునే రీతి, బోధనాభ్యసన సామాగ్రి వాడే విధానం, పరిసరాలతో మమేకం ద్వారా అభ్యసనం, రాగయుక్తంగా పద్యాలు, రైమ్స్ పాడిస్తూ విద్యార్థుల్లో ఆసక్తిని రేకెత్తించడం వంటి అంశాలపై డైట్ సిబ్బంది బోధించిన తీరు అమోఘమని శిక్షణలో పాల్గొన్న నూతన ఉపాధ్యాయులు అంటున్నారు.

పెరిగిన ఆత్మవిశ్వాసం

ఉపాధ్యాయుని డైరీ, లెసన్ ప్లాన్, వార్షిక ప్రణాళిక, పాఠశాల రికార్డులు, తల్లిదండ్రులతో మెలగాల్సిన విధానంపై పూసగుచ్చినట్లు చెప్పి, భావి పౌరుల్ని తీర్చిదిద్దే గురుతర బాధ్యత కలిగిన గురువుల్లో నైపుణ్యం పెంచారు.

దీంతో వీరికి ఆయా రికార్డుల తయారీ, వాటి వినియోగంపై ఉన్న భయాలు పోయి, ఆత్మవిశ్వాసం పెరిగింది.

చక్కని ప్రణాళికతో శిక్షణ

ఇండక్షన్ ట్రైనింగ్‌పై సందేహాలు, నిరాసక్తితో వెళ్లిన కొత్త ఉపాధ్యాయులకు చక్కని ప్రణాళికను అందించడంలో డైట్ సిబ్బంది సఫలీకృతమయ్యారు. మంచి టీచరుగా ఎదగాలంటే అవలంబించాల్సిన తీరు, విద్యా పథకాలు, 21వ శతాబ్దానికి తగ్గట్టుగా సాంకేతికత వైపు ఉపాధ్యాయుని పయనం, కొత్త పాఠ్యపుస్తకాల్లో క్యూఆర్ కోడ్‌ల ఉపయోగం, గణితం, ఈవీఎస్ విద్యా ప్రమాణాలు, బోధనాభ్యసన పద్ధతులు, భాషా స్వభావంపై చక్కని శిక్షణ అందిందని కొత్త ఉపాధ్యాయులు పేర్కొన్నారు.

శిక్షణతో ఎంతో మేలు

ఇండక్షన్ ట్రైనింగ్ ఇచ్చేందుకు మా రిసోర్స్ పర్సన్స్ ఈ వేసవిలో ఎంతగానో కృషి చేశారు. ప్రభుత్వం మంచి నాణ్యతతో కూడిన ఉపాధ్యాయుల ద్వారా బోధన జరగాలని ఆశిస్తోంది. విద్యార్థులకు చక్కని బోధన అందించాల్సింది ఉపాధ్యాయులే. అందుకే వారికి ఏటా ఇలాంటి శిక్షణ అవసరం. ఉపాధ్యాయులు కూడా దీన్ని సద్వినియోగం చేసుకున్నారు.

– మాణిక్యాం నాయుడు, డైట్ ప్రిన్సిపాల్

అ'పూర్వ'కలయిక



సమావేశమైన పూర్వ విద్యార్థులు

రాజవొమ్మంగి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం జరిగింది. పాఠశాలలో పదో తరగతి 2001–2002 బ్యాచ్ విద్యార్థులు కలుసుకున్నారు. ఒకొరికొకరి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అలనాటి మధురజ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. అప్పటి గురువులను ఘనంగా సన్మానించారు. సాయంత్రం వరకు సందడిగా గడిపారు.

13న సాయంత్రం 6 వరకే అప్పన్న దర్శనాలు



సింహాచలం: వరహాలక్ష్మీన్సృసింహస్వామి సోదరి, అడవివరం గ్రామస్తుల ఆరాధ్య దేవత పైడితల్లమ్మ పండగ పురస్కరించుకుని మంగళవారం సాయంత్రం ఆరుగంటల వరకే అపన్నస్వామి దర్శనాలు లభిస్తాయని దేవస్థానం ఏఈవో రాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు ఈ విషయాన్ని గమనించాలని ఆయన కోరారు. ఈ నెల 14 ఉదయం 6.30 గంటల నుంచి యధావిధిగా స్వామి దర్శనం ఉంటుందని పేర్కొన్నారు.

అందుకో జగనన్న కానుక

- జిల్లాలో 87,413 మందికి ప్రయోజనం
- నేడు చిట్టివలసలో జిల్లాస్థాయి వేడుక



కిట్‌ను పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు



జగనన్న విద్యా కానుక కిట్లు

విశాఖ విద్య: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు జగనన్న విద్యాకానుక అందించేందుకు అంతా సిద్ధమైంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సోమవారం గుంటూరు జిల్లా క్రోసూరులో ‹జగనన్న విద్యాకానుక›ను లాంఛనంగా పంపిణీ చేసిన అనంతరం.. జిల్లాలోని ప్రభుత్వ యాజమాన్య పరిధిలోని అన్ని పాఠశాలల్లోని విద్యార్థులకు అందజేయనున్నారు. జిల్లాలోని భీమిలి మండలం చిట్టివలస పాఠశాలలో జిల్లాస్థాయి వేడుక నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రసంగాన్ని ఎల్ఈడీ స్క్రీన్ ద్వారా విద్యార్థులు వీక్షించనున్నారు. కాగా.. వివిధ ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలోని 611 పాఠశాలల్లో 87,413 మంది విద్యార్థులు జగనన్న విద్యాకానుక అందుకోనున్నారు. వీరిలో 42,101 బాలురు, 45,312 మంది బాలికలు ఉన్నారు.

కిట్‌లో ఎనిమిది రకాల వస్తువులు

విద్యార్థులకు అందించే జగనన్న విద్యా కానుక కిట్‌లో ఎనిమిది రకాల వస్తువులు ఉంటాయి. ఒక్కో విద్యార్థికి మూడు జతల యూనిఫాంలు, నోటు పుస్తకాలు, ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీ, ఒక జత బూట్లు, రెండు జతల సాక్సులు, ఒక బెల్టు, పాఠ్య పుస్తకాలతో పాటుగా బ్యాగును అందజేస్తారు. ఒకటి నుంచి 3వ తరగతి వరకు చిన్న సైజు, 4 నుంచి 6 వరకు మిడిల్ సైజు, 7 నుంచి 10 వరకు పెద్ద సైజు బ్యాగు ఇవ్వనున్నారు. ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమం విజయవంతమయ్యేలా మండల, డివిజన్, జిల్లాస్థాయిలో అధికారులకు బాధ్యతలు అప్పగించారు.

పక్కాగా పంపిణీ

కానుకలను పక్కాగా పంపిణీ చేసేలా దృష్టి సారించాం. జిల్లాలోని అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు పంపిణీ చేసేలా సరిపడా కిట్లను ఇప్పటికే సరఫరా చేశాం. జిల్లాకు పూర్తిస్థాయిలో విద్యాకానుక వస్తువులు సరఫరా చేశారు. స్టాక్ పాయింట్లలో అదనపు నిల్వలు కూడా అందుబాటులో ఉంటాయి. ఎక్కడైనా అవసరమైతే, సరఫరా చేసేలా తగిన చర్యలు చేపడతాం.

–శిరీషా రాణి, సీఎంవో, సమగ్ర శిక్ష, విశాఖ జిల్లా

చెరకు, యూకలిప్టస్ తోట దగ్ధం

సుమారు రూ.4 లక్షల మేర ఆస్తి నష్టం



వాకపల్లిలో దగ్ధమైన చెరకు తోట

దేవరాపల్లి : మండలంలోని వాకపల్లిలో ఆదివారం జరిగిన అగ్ని ప్రమాదంలో సుమారు 5 ఎకరాల్లోని చెరకు కార్శి తోట, యూకలిప్టస్ తోట దగ్ధమైంది. మంటలను అదుపు చేసేందుకు గ్రామస్తులు ప్రయత్నించినప్పటికీ ఫలితం దక్కలేదు. ఎండ తీవ్రతతో మంటలు అదుపులోకి రాలేదు. దీంతో గ్రామానికి చెందిన ద్వారపురెడ్డి అచ్చిబాబు, సన్నిబాబు, కొట్యాడ సీతారాంకు చెందిన యూకలిప్టస్ తోట, పెంటకోట అప్పలనాయుడు, జనపురెడ్డి శ్రీను, కొప్పాక చిన్నంనాయుడుకు చెందిన కార్శి చెరుకు తోట అగ్నికి ఆహుతయ్యాయి. తమ కళ్ల ముందే ఆరు గాలం కష్టపడి పెంచిన తోటలు దగ్ధం కావడంతో కాపాడుకోలేక నిస్సహాయ స్థితిలో బాధిత రైతులు ఉండిపోయారు. ప్రభుత్వం తమకు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని బాధిత రైతులు కోరారు. ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు.

చెల్లిని మోసగించి తండ్రి ఆస్తి అమ్మకం...కేసు నమోదు

అనకాపల్లిటౌన్ : తండ్రి ఆస్తిని మోసం చేసి అమ్మకాలు చేసిన ముగ్గురు వ్యక్తులపై పట్టణ పోలీసులు ఆదివారం కేసు నమోదు చేసి విచారిస్తున్నట్టు ట్రాఫిక్ ఎస్ఐ దివాకర్ చెప్పారు. ఎస్ఐ కథనం మేరకు వివరాలు... పట్టణంలో శ్రీరామ్‌నగర్‌కు చెందిన కొమర్తి అప్పారావు, లక్ష్మి దంపతులకు నాగలక్ష్మి, జగదీశ్వరి ఇద్దరు కుమార్తెలు. ఇద్దరికీ వివాహాలు చేశారు. అప్పారావుకు రెండు సెంట్ల స్థలంతో పాటు కొంత భూమి శ్రీరామ్‌నగర్‌లో ఉంది. 2018లో స్థలాన్ని పెద్ద కుమార్తె నాగలక్ష్మి భర్త కోటా శ్రీనివాసరావు, మరిది కోటా రాజులకు అప్పారావు, లక్ష్మి విక్రయించారు. సదరు స్థలంపై శ్రీనివాసరావు, రాజు పట్టణంలో ప్రైవేట్ బ్యాంక్‌లో రూ.5 లక్షలు అప్పుగా తీసుకున్నారు. 2021 మే నెలలో అప్పారావు, లక్ష్మి దంపతులు కరోనాతో మృతి చెందడంతో తండ్రి ఆస్తి దక్కించుకోడానికి నాగలక్ష్మి, జగదీశ్వరి కోటా శ్రీనివాసరావు, రాజులకు రూ.15 లక్షలు ఇచ్చేందుకు ఒప్పందం చేసుకున్నారు. రూ.పది లక్షలు దఫదఫాలుగా అందజేశారు. మిగిలిన రూ.5 లక్షలు బ్యాంక్ రుణం తీర్చుకొందామని ఒప్పందం కుదుర్చుకున్నారు. అయితే తల్లిదండ్రులు మృతిచెందిన తరువాత తహసీల్దార్ కార్యాలయంలో 2021 జూన్‌లో ఫ్యామిలీ సర్టిఫికేట్‌ను తీసుకున్నారు. అదే రోజు నాగలక్ష్మి తహసీల్దార్ కార్యాలయం నుంచి అప్పారావు, లక్ష్మి దంపతులకు ఒకే ఒక కుమార్తెగా పేర్కొంటూ ఫ్యామిలీ సర్టిఫికేట్ తీసుకుని రెండు సెంట్ల స్థలాన్ని మరో వ్యక్తికి అమ్మకం చేశారు. ఈ విషయం తెలుసుకున్న జగదీశ్వరి అక్క, బావ, అతని తమ్ముడిపై ఆదివారం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు ఎస్ఐ చెప్పారు.

వడగాడ్పులకు తమిళనాడు లారీ డ్రైవర్ మృతి

అచ్యుతాపురం(అనకాపల్లి): వడగాడ్పులకు తాళలేక అచ్యుతాపురం మండలం ఇరువాడ జంక్షన్ వద్ద ఓ లారీ డ్రైవర్ మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు. చిత్తూరు జిల్లాకు 40 కిలోమీటర్ల దూరంలో ఉన్న తమిళనాడు రాష్ట్రంలోని అవరకరై గ్రామానికి చెందిన డ్రైవర్ కమల్‌నాథ్(49) శనివారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో పెట్రోల్ బంక్ సమీపంలో లారీ ఆపి, కింద దుప్పటి పరుచుకుని పడుకున్నాడు. అయితే ఆదివారం ఉదయం కూడా డ్రైవర్ లేవకపోవడంతో అనుమానం వచ్చిన వారు పరిశీలించగా అప్పటికే ఆ డ్రైవర్ మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఆటోడ్రైవర్ దుర్మరణం

మరో ముగ్గురికి గాయాలు



రోడ్డు ప్రమాదానికి గురైన ఆటో

ఎస్.రాయవరం : అడ్డురోడ్డు సమీపంలో జాతీయ రహదారిపై ఆటోను ఐషర్‌వ్యాను ఢీకొన్న ప్రమాదంలో ఆదివారం ఒకరు మృతి చెందగా మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ఎస్ఐ ప్రసాద్‌రావు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. అడ్డురోడ్డు జంక్షన్ నుంచి పాయకరావుపేట వెళుతున్న ఆటో అడ్డురోడ్డు సమీపంలో కోనవానిపాలెం జంక్షన్ వద్ద పెట్రోలు బంకుకి వెళ్లేందుకు మలుపు తిప్పడానికి ఆపాడు. ఇంతలో వెనుక నుంచి ఐషర్ వ్యాను ఢీకొట్టింది. దీంతో ఆటో డ్రైవర్ దొడ్డుగల్లు కిరణ్ (38) అవతలి రోడ్డుపై తూలి పడగా, ఎదురుగా లారీ వచ్చి ఢీకొట్టడంతో చక్రాలు కింద పడి నలిగి పోయి అక్కడిక్కడే మృతి చెందాడు. కొరుప్రోలు గ్రామానికి చెందిన కిరణ్‌కు ఏడాది క్రితం లక్ష్మి అనే యువతితో వివాహం జరిగిందని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న పాయకరావుపేట మండలం పెంటకోట గ్రామానికి చెందిన దేగల చందు, దేగల వెంకటలక్ష్మి, జల్లూరి సౌమ్య తీవ్రంగా గాయపడ్డారు. వారిని ముందుగా స్థానికుల సహాయంతో నక్కపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం అనకాపల్లి తరలించినట్టు ఎస్ఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.



ఆటో డ్రైవర్ కిరణ్ (ఫైల్)

మూడు దుకాణాల్లో చొరబడ్డ దొంగలు



దుకాణం పైకప్పు రేకులు పెకలించిన దృశ్యం

చోడవరం రూరల్ : పట్టణంలో చోడవరం–నర్సీపట్నం మెయిన్‌రోడ్డును ఆనుకుని ఉన్న మూడు దుకాణాల్లో శనివారం రాత్రి సమయంలో దొంగలు షాపుల పైకప్పు రేకుల్ని పెకిలించి చొరబడ్డారు. చోడవరం పోలీసుస్టేషన్‌కు ఎదురుగా, కోర్టుల సముదాయాన్ని ఆనుకుని ఉన్న రెండు వేర్వేరు దుకాణాలతో పాటు పట్టణానికి కిలోమీటర్ దూరంలో ఉన్న నర్సయ్యపేట గ్రామంలోని టైల్స్‌షాపులో ఒకే రీతిలో చోరీకి యత్నం జరగడంతో ఏదైనా ఒక ముఠా చోడవరంలో దిగిందా అన్న అనుమానం కలుగుతుంది. పట్టణంలోని దేవదాయశాఖ దుకాణం సముదాయంలోని పక్కపక్కనే ఉన్న జ్యోతి హార్డ్‌వేర్, జ్యోతి ఎలక్ట్రికల్ షాపుల్లో శనివారం రాత్రి దుకాణాలను మూసివేసిన యజమానులు ఆదివారం ఉదయం ఎప్పటిలా తెరవగా పైకప్పు రేకులు తొలగించి ఉండడంతో అవాక్కయ్యారు. క్యాష్ కౌంటర్లలోని సుమారు 500 రూపాయల చిల్లర దొంగలపాలు కాగా, కొన్ని సామాన్లను చిందర వందర చేశారు. ఇదే రీతిలో నర్సయ్యపేట వద్ద టైల్స్ హోల్‌సేల్ షాపులోను పైకప్పు రేకుల్ని తొలగించి లోనికి చొరబడినప్పటికీ ఎటువంటి సొత్తు చోరీ కాలేదని చెబుతున్నారు. కాగా పట్టణం నడిబొడ్డులో మెయిన్‌రోడ్డును ఆనుకుని ఉన్న దుకాణాల్లో దొంగలు చొరబడడం పట్ల పలువురు దుకాణదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాత్రిపూట పోలీసు గస్తీని అధికం చేయాలని కోరుతున్నారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి



రాంబాబు (ఫైల్)

చింతపల్లి : మండలంలోని అన్నవరం పంచాయతీ బరింగిబందకు చెందిన ఓ గిరిజన యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. మృతుడి తండ్రి వెంకటరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అన్నవరం ఎస్ఐ రమణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కొంత కాలంగా రాంబాబుకు మతి స్థిమితం సక్రమంగా లేదని, అప్పుడప్పుడు ఇంటి నుంచి చెప్పకుండా వెళ్లిపోవడం, కుటుంబ సభ్యులు అతని ఆచూకీ తెలుసుకుని తిరిగి ఇంటికి తీసుకురావడం జరుగుతుందని తెలిపారు. ఈ నేపథ్యంలో శుక్రవారం రాత్రి రాంబాబు ఇంటి నుంచి పరారవుతుండగా అతని భార్య, సోదరి పట్టుకునేందుకు ప్రయత్నించినప్పటికీ తప్పించుకుని పారిపోయాడన్నారు. ఆదివారం కొత్తూరు బయలువాగులో రాంబాబు శవమై కనిపించాడు. ఈమేరకు మృతుడి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి విచారణ చేపడుతున్నామని ఎస్ఐ రమణ తెలిపారు.

పశువుల కంటైనర్ల స్వాధీనం



స్వాధీనం చేసుకున్న కంటైనర్లు, అదుపులోకి తీసుకున్న నిందితులు

చింతూరు : ఒడిశా నుంచి అక్రమంగా పశువులు తరలిస్తున్న మూడు కంటైనర్లను ఆదివారం చింతూరు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మండలంలోని చట్టివద్ద వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా ఉన్న కంటైనర్లను ఆపి సోదా చేయగా పశువుల అక్రమ రవాణా వ్యవహారం బయటపడినట్టు చింతూరు ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు. మూడు కంటైనర్లలో 230 పశువులను కుక్కి క్రూరంగా హింసించి రవాణా చేస్తున్నారని ఆయన తెలిపారు. పశువులను ఒడిశా రాష్ట్రం నవరంగపూర్ నుంచి హైదరాబాద్‌కు తరలిస్తున్నారని, మూడు కంటైనర్లను స్వాధీనం చేసుకుని పశువులను గోకవరంలోని గోశాలకు తరలించినట్టు ఎస్ఐ తెలిపారు. పశువుల అక్రమ రవాణాకు పాల్పడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకున్నట్లు ఆయన తెలిపారు.

ఆత్మహత్యకు పాల్పడిన జగ్గన్నపేట వాసి మృతి

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని జగ్గన్నపేటకు చెందిన బి.రవి అనే వివాహితుడు ఆత్మహత్యకు పాల్పడి మృతి చెందాడు. ఈ నెల 6వ తేదీన రవికి అదే గ్రామానికి చెందిన ఇద్దరితో పురుషోత్తపురం వద్ద జరిగిన గొడవతో పాటు, జగ్గన్నపేటలో జరిగిన గొడవ కారణంగా మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్టు రవి కుటుంబ సభ్యులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

బైక్ అపహరణపై కేసు నమోదు

మునగపాక : మండలంలోని టి.సిరసపల్లిలో బైక్ అపహరణకు సంబంధించి కేసు నమోదు చేసినట్టు ఏఎస్ఐ దొర తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. సిరసపల్లి గ్రామానికి చెందిన పిల్లా లక్ష్మీనారాయణ ఈ నెల 7వ తేదీన వ్యక్తిగత పనిపై అనకాపల్లి నుంచి స్వగ్రామం తన బైక్‌పై రాత్రి 10 గంటలకు వచ్చాడు. 8వ తేదీన ఉదయం 6 గంటలకు నిద్ర లేచి చూసేసరికి బైక్ కనిపించలేదు. దీంతో పరిసర ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ తెలియలేదు. దీంతో లక్ష్మీనారాయణ మునగపాక పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఏఎస్ఐ దొర కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

నర్సీపట్నం : నర్సీపట్నం మున్సిపాలిటీ పీనారపాలెం కేంద్రంగా యూత్‌కు గంజాయి విక్రయిస్తున్న బి.రాము(50) నుండి మూడు కిలోల గంజాయి స్వాధీనం చేసుకుని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు టౌన్ సీఐ ఎస్.గణేష్ తెలిపారు. రామును గతంలో గంజాయి కేసులో అరెస్టు చేశామన్నారు.

సారా విక్రేత అరెస్టు

నాటు సారా..అనధికార మద్యం బాటిల్స్ కలిగిన వ్యక్తులను అరెస్టు చేశామని సీఐ తెలిపారు. పెదబొడ్డేపల్లి ఏతపేటకు చెందిన పెంకి సత్యవతి(43) నాటు సారా విక్రయిస్తుండగా పట్టుకుని ఆమె వద్ద నుంచి నాలుగు లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు.